అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంగ్లిష్, గణితం, కామర్స్, కంప్యూటర్స్ సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫ్యాకల్టీ) కొరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు పీజీ (పోస్ట్ గ్రాడ్యుయేషన్) లో సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. నెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, పై సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకునేవారు, అన్ని సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో జులై 2వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరులో దరఖాస్తు చేసుకోవాలన్నారు.దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో జులై 3 వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సంగారెడ్డిలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

శంషాబాద్: శంషాబాద్ (రాజేంద్రనగర్) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హిమబిందు ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, హిస్టరీ పొలిటికల్ సైన్స్, గణితం, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాల్లో ఒక్కో పోస్టు, కామర్స్ విభాగంలో రెండు లెక్చరర్ పోస్టులున్నాయన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ 55 శాతం మార్కులతో, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పీహెచ్‌డీ, బోధనానుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ఔత్సాహిక అభ్యర్థులు జులై 2వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

యూనిఫాంల పంపిణీ



విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలకు అవలీలగా చేరవచ్చని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం శేరిలింగంపల్లి గోపీనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రాజుయాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్, బస్తీ అధ్యక్షులు గోపాల్‌యాదవ్, నాయకులు రవియాదవ్, రాజ్‌కుమార్ ముదిరాజ్, నర్సింహ, పాండు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అగ్నిప్రతిష్ఠ, నిత్యహోమం, గరుడ ధ్వజారోహణ, సంతానప్రద గరుడ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. సంతానం కలగని పలువురు ఆలయానికి చేరుకొని గరుడ ప్రసాదాన్ని స్వీకరించారు. ఆదివారం స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్న ప్రసాదం వితరణ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



వామ్మో.. భౌభౌ!

- వీధి కుక్కల స్వైర విహారం
- భయాందోళనలో జనం
- ఒక్కరోజే ఐదుగురికి కాటు
- నివారణ చర్యలు నిల్



వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. నిత్యం ఏదో ఒక చోట చిన్నారులపై దాడి చేస్తున్నాయి. చిన్నపిల్లల్ని బయటకు పంపించాలంటేనే తల్లిదండ్రులు హడలిపోతున్నారు. కుక్కలు గుంపులు, గుంపులుగా రోడ్లపై తిరుగుతూ పిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్రవాహనదారులను వెంబడించి పరుగులు పెట్టిస్తున్నాయి. రాత్రివేళల్లో మనుషులు కనిపిస్తే చాలు దాడులు చేసి గాయపరుస్తున్నాయి. కుక్కలు కనబడితే చాలు ప్రజలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. ప్రతీరోజు ఏదో ఒకచోట వీధి కుక్కల బారిన పడి గాయపడిన సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఏదైనా ఘటన జరిగినప్పుడే స్పందించే అధికారులు తరువాత పట్టించుకోవడం లేదు.

– పటాన్‌చెరు టౌన్

పటాన్‌చెరు డివిజన్, మండల పరిధిలోని 19 గ్రామాల్లో వీధికుక్కల బెడద అధికంగా ఉంది. ఎక్కువగా చిన్నపిల్లలపై దాడి చేసి గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం మండల పరిధి కర్దనూరు గ్రామంలో భాను(13) అనే బాలుడిని కుక్క కరవడంతో కుటుంబ సభ్యులు గ్రామపంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. అదేవిధంగా డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్ కాలనీ రోడ్ నంబర్ 7లో స్కూల్‌కు వెళ్లే పిల్లలపై కుక్కలు దాడి చేశాయి. వాటిని ఈ ప్రాంతం నుంచి తరలించాలని స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. నిబంధనల ప్రకారం కుక్కలను పట్టుకుని క్రిమిరహితం చేసిన తర్వాత.. వాటిని ఎక్కడి నుంచి పట్టుకున్నామో అక్కడే వదిలేయాల్సి ఉంటుంది.

పటాన్‌చెరులో ఒకేరోజు ఐదు కేసులు

పటాన్‌చెరు మండలంలో శుక్రవారం ఒక్క రోజే ఐదు కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. ఇస్నాపూర్‌లో బహిర్భూమికి వెళ్లిన ఆరేళ్ల బాలుడిని నాలుగు కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరచడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఘటనలో పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో 8 నెలల పాపపై కుక్క దాడి చేసింది. దీంతో పాపను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చి మెరుగైన చికిత్స కోసం నిలోఫర్‌కు తరలించారు. పటాన్‌చెరు, లక్డారం, ఇంద్రేశంలో మరో ముగ్గురిపై కుక్కలు దాడి చేయడంతో చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి వచ్చినట్లు ఆర్ఎంఓ ప్రవీణ తెలిపారు.

జాగ్రత్తలు, సూచనలు

- కుక్క కరిచిన వ్యక్తి ఐదుసార్లు వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుంది.
- కరిచిన రోజు, మూడో రోజు, ఏడవ రోజు, 14వ రోజు, 28వ రోజు భుజానికి రెబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలి.
- కుక్క కాటు ప్రాంతంలో రక్తస్రావం అయితే ఈ వ్యాక్సిన్ తోపాటు రెండు రోజుల లోపు ఇమ్యునోగ్లోబిలిన్ ఇంజక్షన్‌ను కరిచిన చోట తీసుకోవాలి.
- ఈ ఇంజెక్షన్ శరీరానికి తక్షణ బూస్టర్‌లా పనిచేస్తుంది.
- దీనివల్ల రేబిస్ వ్యాధి సోకకుండా ఉంటుంది.
- రేబిస్ వ్యాధి సోకితే ప్రపంచంలో ఎక్కడా చికిత్స లేదని వైద్యులు తెలిపారు.

జూన్‌లో 96 కేసులు

పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఆర్‌వీ(యాంటీ రేబిస్ వ్యాక్సిన్) అందుబాటులో ఉంది. జూన్ నెలలో 96 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. శుక్రవారం ఒక్క రోజే పటాన్‌చెరు, ఇస్నాపూర్, ముత్తంగి, లక్డారం, ఇంద్రేశం నుంచి ఐదు కేసులు వచ్చాయి. వారికి వ్యాక్సిన్ ఇచ్చాం.

– డాక్టర్ ప్రవీణ, ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ

పైప్‌లైన్‌తో వరదనీటి సమస్య పరిష్కారం



అండర్ గ్రౌండ్ నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఇండియన్ బ్యాంక్ నుంచి ఎల్లమ్మ చెరువు సర్‌ప్లస్ నాలా వద్ద 2 కోట్ల రూపాయల నిధులతో జరుగుతున్న భూగర్భ పైపులైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉషా ముళ్లపూడి ప్రధాన రహదారిలోని శుభోదయ కాలనీ పరిసర ప్రాంతాల్లో రోడ్డుపై నిలిచిపోతున్న వరదనీటిని ప్రస్తుతం నిర్మిస్తున్న పైపులైన్ల ద్వారా నేరుగా ఎల్లమ్మ చెరువు సర్‌ప్లస్ నాలాలో కలిసేటట్లుగా పైపులైన్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. చిన్న వర్షానికి కూడా ఇండియన్ బ్యాంక్ వద్ద నీరు నిలిచిపోయి పక్కన అపార్టుమెంట్, ఇళ్లల్లోకి చేరి ప్రజలు ఇబ్బంది పడేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం భూగర్భ పైపులైన్ నిర్మాణంతో వరదనీటి సమస్య తొలగిపోతుందని అన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టి గౌడ్, నజీర్, మోజస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే



పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక దేవాలయాన్ని శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాండు, ఎంపీటీసీ రాజు, ఆలయ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ఎమ్మెల్యే కుమారుడు గూడెం విక్రమ్‌రెడ్డి, గూడెం సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మోతీనగర్: జ్యేష్ఠ మాస బహుళ అష్టమి సందర్భంగా మూసాపేట డివిజన్ అవంతినగర్‌లోని శ్రీ శివరామాంజనేయ ఆలయ ఆవరణలోని శ్రీ ప్రత్యంగిరా సమేత కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 శనివారం ఉదయం 9 గంటలకు అభిషేకం, కూష్మాండ దీపార్చన, అష్టోత్తర శత నామావళి, మహా హారతి, ప్రత్యంగిరాదేవికి మిరపకాయల మాల సమర్పణ ఉంటుందన్నారు.

నీటి ట్యాంకర్లు సీజ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లో నీటి వ్యాపారం జరుగుతున్న వ్యవసాయ భూమిని శుక్రవారం తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి సందర్శించి 5 నీటి ట్యాంకర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ భూముల నుంచి అక్రమంగా నీటిని తోడి వ్యాపారం చేస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

విద్యార్థినికి చేయూత



రూ.20వేల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్: పేద విద్యార్థిని చదువు నిమిత్తం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ శుక్రవారం రూ.20వేల చెక్కును విద్యార్థిని తల్లి శ్రీలతకు అందజేశారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారుడు రామ్‌కుమార్ కుమార్తె ధరణి 10వ తరగతి చదువుతుంది. కాగా రామ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తన వంతు సహాయ సహకారాలు అందించానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లారెడ్డి పాల్గొన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే కార్యక్రమంలో 'మేనేజింగ్ టైమ్' అనే అంశంపై సీనియర్ రాజయోగ టీచర్, మోటివేషనల్ స్పీకర్ బీకే రజని ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

బీజేపీ నాయకుల వినతి

మూసాపేట: మూసాపేట పరిసర ప్రాంతాల్లో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని తగు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు సర్కిల్ ఉప కమిషనర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మూసాపేట కార్పొరేటర్ మహేందర్, నాయకులు మాట్లాడుతూ మూసాపేట పరిసర ప్రాంతాల్లో చెరువులు ఎక్కువగా ఉన్నాయని, గుర్రపు డెక్కను ఎప్పటికప్పుడు తొలగించకపోవటంతో దోమలు ప్రబలుతున్నాయని వాపోయారు. కార్మికులకు రాత్రిళ్లు నిద్రపట్టక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫాగింగ్ చేయాలని, చెరువులు, కుంటలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా స్ప్రే చేయించాలని కోరారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు శ్రీకర్‌రావు, డివిజన్ అధ్యక్షులు పిట్ల మనోహర్, నాయకులు తూము శైలేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరభద్రస్వామి ఆలయంలో పార్కింగ్, అమ్మవారి చీరల విక్రయం, ఒడి బియ్యం, స్వామివారి వస్త్రములను వేలం వేసే ప్రక్రియను జులై 3న నిర్వహించనున్నట్లు ఈఓ శశిధర్ తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన వివరాలను శశిధర్ వెల్లడించారు. వేలం పాటలో పాల్గొనే వారు దేవాలయంలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

విశ్వేశ్వర్‌రెడ్డికి 'బిజినెస్ లీడర్ ఆఫ్ ద ఇయర్'



లక్డీకాపూల్: షిరిడీ సాయి ఎలక్ట్రిక్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. విశ్వేశ్వర్ రెడ్డి బిజినెస్ లీడర్ ఆఫ్ ది ఇయర్ –2024 అవార్డును తెలంగాణ ఐటీ కార్యదర్శి జయేష్ రంజన్ చేతుల మీదుగా అందుకున్నారు. ది టైమ్స్ గ్రూప్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో మాదాపూర్ ఐటిసి కోహినూర్ హోటల్లో ది మెషినిస్ట్ షాప్ ఫ్లోర్ అవార్డ్స్ వేడుకలు శుక్రవారం అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తన జీవితంలో అందుకున్న ప్రతి అవార్డు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందన్నారు. గతేడాది తాను 2023 సంవత్సరానికి గాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా నేషనల్ ఎనర్జీ కన్జర్వేటివ్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేయాలి



మేరు ఇంటర్నేషనల్ స్కూల్‌లో మిస్‌మూన్– 24

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ మదీనాగూడలోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్‌లో మిస్‌మూన్– 24 ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గరెత్ విన్ ఓవెన్, పాఠశాల వ్యవస్థాపకరాలు గోరుకంటి జూపల్లి, ప్రిన్సిపల్ దౌత్యంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలన్నారు. అంతర్జాతీయ సమస్యలపై చర్చించి పరిష్కారం చూపేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ డిబేట్ లో 40 పాఠశాలల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

అయ్యప్ప సొసైటీలో అక్రమ కట్టడాల కూల్చివేత



మాదాపూర్: మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో శుక్రవారం అక్రమ కట్టడాలను అధికారులు కూల్చివేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, ఎన్నిసార్లు హెచ్చరించినా పట్టించుకోవడం లేదని ,అక్రమ కట్టడాలను ఉపేక్షించబోమని డిప్యూటి కమిషనర్ వంశీకృష్ణ తెలిపారు. జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టినట్టు చెప్పారు. కూల్చివేతల్లో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు చేపట్టాలి

రహమత్‌నగర్: రహమత్‌నగర్ కూడలిలోని రహదారి విస్తరణ పనులు వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ రహమత్‌నగర్ రహదారి విస్తరణ జరుగక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించగా స్పందించిన జెడ్‌సీ సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు.

సిద్దులగుట్ట రోడ్డును పునరుద్ధరించాలి

శంషాబాద్: సిద్దులగుట్ట రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టాలని శంషాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 14వ వార్డు పరిధిలో రాళ్లగూడ నుంచి సిద్దులగుట్ట వరకు ఉన్న రోడ్డు గోతులమయంగా మారిందన్నారు. మరో నెల రోజుల్లో రానున్న సిద్దులగుట్ట జాతరకు వేలాది మంది భక్తులు తరలి వస్తారన్నారు. ఈ సందర్భంగా రోడ్డు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బస్సులు లేక..

ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు



జిన్నారం(పటాన్‌చెరు): ఆర్టీసీ బస్సుల సంఖ్య తగ్గిపోయింది. బస్సులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో మండల కేంద్రానికి రావడానికి ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల సంఖ్యను పెంచేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జిన్నారం మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సుల సంఖ్య పూర్తిగా తగ్గింది .జిన్నారం నుంచి పటాన్‌చెరు, బాలానగర్, సికింద్రాబాద్, నర్సాపూర్, సంగారెడ్డి పట్టణాలకు ఉద్యోగులు, ప్రజలు వెళ్లేందుకు అవస్థ పడుతున్నారు. మండలంలోని బొల్లారం, గడ్డపోతారం, ఖాజీపల్లి, శివానగర్ లాంటి దూర గ్రామాల నుంచి రాకపోకలు కష్టతరమయ్యాయి. గతంలో నర్సాపూర్, పటాన్‌చెరు, జీడిమెట్ల డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు వచ్చేవి. ఇప్పుడు కేవలం పటాన్‌చెరు, నర్సాపూర్ డిపోలకు చెందిన బస్సులు మాత్రమే నడుపుతున్నారు. అవికూడా కేవలం ఉదయం, సాయంత్రం ట్రిప్పులు మాత్రమే. బస్సులు సమయానికి లేకపోవటంతో గ్రామస్తులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాలను కలుపుతూ జిన్నారానికి బస్సులు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరిన్ని బస్సులు వేసేలా కృషి

సోలక్‌పల్లి నుంచి వస్తున్న నర్సాపూర్ డిపో బస్సును జిన్నారం మీదుగా నడిచేలా వేయించాం. మండల కేంద్రం మీదుగా మరిన్ని బస్సులు వచ్చేలా ఆర్టీసీ అధికారులు, డిపో మేనేజర్లతో మాట్లాడుతున్నాం. త్వరలోనే బస్సుల సమస్య పరిష్కారమవుతుంది.

–రవీందర్‌గౌడ్, ఎంపీపీ

సైబర్ వలలో రిటైర్డ్ పోలీస్ అధికారి

- రివార్డ్స్ పేరిట మోసం
- రూ.2, 91,000 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: రివార్డ్స్ పేరుతో వచ్చిన మెసేజ్‌కు స్పందించిన రిటైర్డ్ పోలీస్ అధికారి రూ.2 లక్షల 91 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. డివిజన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన రిటైర్డ్ పోలీస్ అధికారికి జూన్ 2 వ తేదీన ఎస్‌బీఐ యోనో రివార్డ్స్ వచ్చాయని అంటూ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది.దీంతో బాధితుడు లింక్‌ను క్లిక్ చేసి, తన వివరాలను నమోదు చేశాడు. వెంటనే అతని ఖాతా నుండి రూ.50 వేలు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. అనంతరం పలు దఫాలుగా మొత్తం రూ.2 లక్షల 91 వేలు డెబిట్ అయినట్టు మెసేజ్ రావడంతో బాధితుడు తన మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి కృషి

కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్



స్థానికులతో మాట్లాడుతున్న జగదీశ్వర్ గౌడ్

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్ శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేస్తానని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జీ జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అంజయ్యనగర్ శ్మశానవాటికను పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఆయా డివిజన్లకు మంజూరైన అభివృద్ధిపనులను త్వరితగతిని పూర్తి చేయాలని అధిరులను కోరారరు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ గౌస్, విక్రమ్, యాదయ్య, వినోద్ యాదవ్, చంద్రకాంత్, మురళి, ఆంజనేయులు సాగర్ పాల్గొన్నారు.

'మనూ'లో మెరిట్ ఆధారిత అడ్మిషన్లకు గడువు పొడిగింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మెరిట్ ఆధారిత కోర్సులలో దరఖాస్తునకు చివరి తేదీని జులై 7 వరకు పొడిగించడం జరిగిందని 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ శుక్రవారం తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 6207728673, 9866802414, 6302738370, 75004693646లలో సంప్రదించాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులు, ఇతర వివరాలు యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో ఉంటాయని ఆమె వివరించారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా నల్లగండ్ల హుడా, లక్ష్మీవిహార్ కాలనీ, అపర్ణ, గోపన్‌పల్లి ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

- నల్లగండ్ల హుడా కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 గంటల వరకు నల్లగండ్ల హుడా కాలనీ, నల్లగండ్ల ఏరియా, రత్నదీప్ సూపర్ మార్కెట్ బ్యాక్ సైడ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.
- 11 కేవీ లక్ష్మీవిహార్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1 గంట వరకు లక్ష్మీవిహార్ ఫేజ్–1 కాలనీ, ఫేజ్–2 కాలనీ, నల్లగండ్ల విలేజ్, డాక్టర్స్ కాలనీ సౌత్ పార్కు ఏరియాల్లో..
- అపర్ణ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1గంట నుంచి 1.30 వరకు అపర్ణ అపార్టుమెంట్స్, నల్లగండ్ల విలేజ్, నల్లగండ్ల సర్కిల్‌లో..
- గోపన్‌పల్లి తండా ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2 గంటల వరకు గోపన్‌పల్లి తండా, గోపన్‌పల్లి ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని, విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

మియాపూర్‌లో..

మియాపూర్: రాంనరేష్, కేంద్రీయ విహార్, వర్‌టెక్స్, హైదర్‌నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ హరీష్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 11.30 గంటల వరకు రాంనరేష్‌నగర్, ఓల్డేజ్ హోం, మిత్రహిల్స్, మధ్యాహ్నం 12 గంటల నుండి 12.30 వరకు కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్, మయూరినగర్ పార్క్, వర్‌టెక్స్ అపార్ట్‌మెంట్, బృందావన్ కాలనీ, 12.30 గంటల నుండి 1గంట వరకు జై భారత్ నగర్, బృందావన్ కాలనీల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలో ..

గచ్చిబౌలి: గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పివిబి వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు గచ్చిబౌలి స్ట్రీట్ నెంబర్ 1,2,3, గచ్చిబౌలి మెయిన్ రోడ్డు, నానక్‌రాంగూడలో విద్యుత్ ఉండదని వివరించారు.

- టెలికామ్‌నగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి 12 గంటల వరకు టెలికామ్‌నగర్, ఎస్‌బీఐ క్వార్టర్స్, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, ఎస్‌బీఐ డాటా సెంటర్ ప్రాంతాలలో..
- టీఎన్‌జీఓ ఫీడర్ పరిధిలో.. ఉదయం 12 గంటల నుంచి 12.30 గంటల వరకు టీఎన్‌జీఓ కాలనీ, ఏపీహెచ్‌బీ కాలనీ, రాడిసన్ హోటల్ ప్రాంతాలలో ..
- కొమరమ్ భీం ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1 గంట వరకు టీఎన్‌జీఓ కాలనీ, ఏపీహెచ్‌బీ కాలనీ ప్రాంతాలలో ..
- ప్రశాంత్‌హిల్స్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 గంటల వరకు ప్రశాంత్‌హిల్స్ కాలనీ, గౌలిదొడ్డి, పద్మశ్రీ గార్డెన్స్ పరిధిలో విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు.

వేమనకాలనీ, మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్ : వేమనకాలనీ, మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు శిల్పా ఎన్‌క్లేవ్‌లో విద్యుత్ సరఫరా ఉండదు
- సీబీఆర్ ఎస్టేట్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు సీబీఆర్ ఎస్టేట్, దీప్తి శ్రీనగర్ ప్రాంతాలలో ..

తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో...

- చందానగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి 11.30 గంటల వరకు చందానగర్ మెయిన్ రోడ్డు, వెంకటేశ్వర స్వామి టెంపుల్, చెన్నారెడ్డి హాస్పటల్ దగ్గర, గీతా థియేటర్ ఏరియాలలో..
- హుడా కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 12.30 గంటల వరకు చందానగర్ హుడా కాలనీ ప్రాంతాలలో ..
- లింగంపల్లి ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.00 గంట వరకు లింగంపల్లి మటన్ మార్కెట్, పోలీస్ క్వార్టర్స్, కానుకుంట, వెజిటబుల్ మార్కెట్, ఎస్ఎం లేవుట్ ఏరియాలలో ..
- పాపిరెడ్డి కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.00 గంటల నుంచి 1.30 గంటల వరకు పాపిరెడ్డి కాలనీ, స్ప్రింగ్ వ్యాలీ, భాగ్యలక్ష్మి కాలనీ ఏరియాలలో..
- శాంతినగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.00 గంటల వరకు శాంతినగర్, కడిమి హాస్పిటల్, హుడా కేఫ్ దగ్గర, వెంకటాద్రినగర్, జీహెచ్ఎంసీ మీ సేవ వీధి, విద్యా నర్సింగ్ హోం ఏరియాలలో విద్యుత్ ఉండదు.

రాంగ్‌రూట్.. 73 కేసులు నమోదు

శంషాబాద్: శంషాబాద్, షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో గత నెల రోజులుగా రాంగ్‌రూట్‌లో వచ్చిన 73 మందిపై కేసులు నమోదు చేసినట్లు శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం తెలిపారు.